క్లుప్తంగా

శ్రామికశక్తి యూనియన్ బీఆర్‌టీయూగా గుర్తింపు



పత్రాలు అందుకుంటున్న శంకర్‌రెడ్డి

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలోని శ్రామికశక్తి ఎంప్లాయీస్ అండ్ బదిలీస్ యూనియన్‌ను బీఆర్‌టీయూ (భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్)గా గుర్తిస్తూ బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు గంజి రాంబాబు గుర్తింపు పత్రం అందించారు. శ్రామికశక్తి యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డికి శుక్రవారం రాంబాబు గుర్తింపుపత్రాలను అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహారావు, సతీశ్‌యాదవ్, కంది రాజశేఖర్ రెడ్డి, బిజ్జం బాలకృష్ణారెడ్డి తదితరులున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి..

అశ్వాపురం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మల్లెలమడుగు సర్పంచ్ కోడి కృష్ణవేణి అన్నారు. మండలంలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆరుగురు గర్భిణులకు సీమంతం చేసి చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు రెడ్డి అరుణ, సాహితీ, నాగమణి, రావమ్మ, హంసవేణి, సుధ, శైలజ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ రేవతి శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో దాహార్తిని తీర్చడానికి పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ షబ్నా, సర్పంచ్ బోడా పద్మ, ఉప సర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, జీపీ సెక్రటరీ ఖాదర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

దుమ్ముగూడెం: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సిఫార్సుతో విడుదల చేసిన ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో మండలంలోని పెద్దనల్లబల్లి పంచాయతీ పరిధిలోని కె.లక్ష్మీపురం గ్రామంలో రూ.3 లక్షలు, అచ్చితాపురం పంచాయతీ పరిధిలోని అచ్చితాపురం గ్రామంలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, నాయకులు బైరెడ్డి సీతారామారావు, శిరపు అప్పలరెడ్డి, సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ధి దేవా, యూత్ నాయకుడు లంకా శివకుమార్, మాజీ సర్పంచ్ కంగాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామంలో ముత్యాలమ్మతల్లి గుడి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరుణ్‌రెడ్డి, టీవీ సుబ్బారెడ్డి, సత్యనారాయణ, లక్ష్మణ్, రవి, రాంమోహన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతిపై దాడి

- యువకుడిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: పెళ్లికి నిరాకరించిందని ఓ యువతిపై దాడి చేసిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌ఐ బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడేనికి చెందిన తేజావత్ శివకు ఆరు నెలల కిందట ఇదే గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి సంబంధం కుదిరింది. తాజాగా సదరు యువతి కుటుంబీకులు పెళ్లి చేసేందుకు నిరాకరించి వద్దన్నారు. పెళ్లి నిరాకరిస్తావా అంటూ.. సదరు యువతిని శివ దూషిస్తూ, దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత యువతి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కష్టాలు ‘డబుల్’

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో ప్రజల అవస్థలు
- అందని మిషన్ భగీరథ తాగునీరు
- డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకునే నాథులేరని లబ్ధిదారుల ఆరోపణ





సమితిసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ సముదాయం (ఇన్‌సెట్) ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

మణుగూరుటౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు దక్కిన ఆనందం ఎక్కువసేపు నిలువలేదు. గూడు దొరికిందని సంతోషించేలోపే మౌలిక సదుపాయాలు లేక నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. అంతర్గత రోడ్లు మచ్చుకు కూడా లేవు. డ్రెయినేజీ మాట దేవుడెరుగు.. ఇక మిషన్ భగీరథ తాగునీరు ఒక్క చుక్క కూడా దొరకడం లేదు. వెరసి మున్సిపాలిటీలోని సమితిసింగారం పంచాయతీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో సమస్యలు పేరుకుపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సమితిసింగారం పంచాయతీ పరిధి 220 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో నిర్మించిన 80 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారికి కనీసం డ్రెయినేజీల నిర్మాణం, అంతర్గతరోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మారుమూల గ్రామాలకు సైతం మిషన్ భగీరథ పథకం నీరు అందిస్తున్నామని చెబుతున్న ప్రజాప్రతినిధులు.. మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్న వారికి తాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేకసార్లు ఆ ప్రాంత ప్రజలు తాగునీరు సరఫరా చేయాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. డబుల్ బెడ్‌రూమ్‌లలో నివాసముండేవారు ఆ పక్కనే ఉన్న ఓ ఇంటి వద్దకు వచ్చి తాగునీరు తీసుకొని వెళ్తున్నారు. ఇక మురికినీరు రోడ్లపైకి రావడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పందులు ఈ ప్రాంతాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

నల్లాలు ఏర్పాటు చేయాలి



డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చారు. కానీ, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో పక్కనే ఉన్న ఓ మాజీ వీఆర్‌ఏ ఇంటికి వెళ్లి తాగునీరు తీసుకొస్తున్నాం. సరైన డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురికినీరు ఇండ్ల మధ్య నిల్వ ఉంటోంది. దుర్వాసన వస్తోంది. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి.

–వజ్జ పుల్లమ్మ, డబుల్ బెడ్‌రూమ్ ఏరియా, సమితిసింగారం

డ్రెయినేజీలు నిర్మించాలి..



మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో సీసీ రోడ్లు నిర్మించాలి. డ్రెయినేజీలు నిర్మించి ఇక్కడ నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు లేకుండా చూడాలి. మున్సిపాలిటీ అధికారులు లేదా సమితిసింగారం పంచాయతీ అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి.

–నిట్టా చిట్టిబాబు, స్థానికుడు

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

మణుగూరురూరల్: ఈ నెల 2, 3 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే ఇఫ్టూ రాష్ట్ర ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మణుగూరులోని పారిశుద్ధ్య, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2వ తేదీన కార్మికులచే భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరగనున్నాయని చెప్పారు. సభలో ఇఫ్టూ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు, జాతీయ నాయకులు అమితాబ్‌లతో పాటు రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు హాజరై కార్మిక సమస్యలపై, ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రసంగిస్తారన్నారు. 3న వివిధ జిల్లాలకు చెందిన కార్మికవర్గ ప్రతినిధులతో సభ జరగనుందని తెలిపారు. సమావేశంలో ఇఫ్టూ నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఎ.మంగీలాల్, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి గణేశ్, జిల్లా నాయకులు ప్రణయ్‌కుమార్, కాంట్రాక్ట్ కార్మికులు బి.లక్ష్మణ్, వెంకన్న, రాంబాబు, ఆదిలక్ష్మి, కొమరక్క, సుభద్ర, గురుమూర్తి, రవి, వీర్రాజు, సాంబ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కారు బోల్తా



బోల్తా పడిన కారు

చర్ల: మండలంలోని కుదునూరు శివారులో శుక్రవారం సాయంత్రం కారు అదుపుతప్పి బోల్తా పడింది. మండలంలోని కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి కొత్తగూడెం నుంచి తన కారులో చర్లకు వస్తున్నాడు. ఈ క్రమంలో భారీ వర్షం కురుస్తుండడంతో పాటు మెరుపులు, ఉరుములు వస్తున్నాయి. కుదునూరు శివారులోకి రాగానే భారీగా మెరుపు రావడం.. కారు సమీపంలోనే పిడుగుపడినట్లు అనిపించడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. కారు నెమ్మదిగా నడుపుతుండటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. కారు పల్టీకొట్టిన సమాచారం తెలుసుకున్న యువకులు హుటాహుటిన అక్కడకు చేరుకొని అందులో ఉన్న వ్యక్తిని బయటకు తీశారు.

పర్ణశాలలో గాలి వాన బీభత్సం



గాలిదుమారానికి కూలిన టెంట్లు

దుమ్ముగూడెం: మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వాతవరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. సాయంత్రం సమయంలో భారీ ఈదురుగాలులు రావడంతో పాటు వర్షం పడటంతో ఎండవేడికి తల్లడిల్లిన ప్రజలు సేదతీరారు. కానీ, భారీ గాలి దుమారం వల్ల పర్ణశాలలో ఏర్పాటు చేసిన క్లాత్ డేకరేషన్ మొత్తం కూలిపోయింది. గోదావరి ఒడ్డు నుంచి దుమారం రావడంతో గోదావరిలోని ఇసుక అంతా పైకి లేచి చీకటి కమ్మేసింది. పది నిమిషాల సమయంపాటు భారీ గాలులు రావడంతో ఎక్కడేమి కూలిపోతాయోననే భయంతో పర్ణశాలలో ప్రజలు, భక్తులు వణికిపోయారు.

ఘనంగా సీతారాముల శోభాయాత్ర



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న భక్తులు

మణుగూరురూరల్: మండలంలోని సమితి సింగారంగ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవాన్ని అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సీతారాములు, లక్ష్మణస్వామిని ప్రధాన రహదారి గుండా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భక్తులు నృత్యాల, కోలాటాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరామ భక్త బృందం, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మోటార్ సైకిల్‌పై భద్రాచలం వైపునకు వస్తున్న యువకుడు అదుపుతప్పి బారికేడ్లను ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు గమనించి వెంటనే భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అయితే గాయపడిన యువకుడి పేరు వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

డిగ్రీ కళాశాలకు ‘బీ’ డబుల్‌ప్లస్ గ్రేడ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు బీ–డబుల్‌ప్లస్ గ్రేడ్ లభించినట్లు కళాశాల ప్రధానాచార్యులు భద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలోనే డబుల్ ప్లస్ గ్రేడ్‌లో భద్రాచలం డిగ్రీ కళాశాల అతి పెద్ద కళాశాలగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. సమష్టి కృషితోనే కళాశాలకు డబుల్ ప్లస్ గ్రేడ్ సాధ్యమైందని, ఈ ఘనత సాధించడంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని గుంపెన గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు శుక్రవారం దాడి చేశారు. దాడిలో రూ.20,230 నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఐదుగురు వ్యక్తులు పరారయ్యారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షాహీన తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ స్వప్నకుమారి

అశ్వాపురం: మండలంలోని ప్రభుత్వ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను నియోజకవర్గంలోని గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఐటీడీఏ భద్రాచలం ఏపీఓ డేవిడ్‌రాజు అన్నారు. మండలంలోని మిట్టగూడెం గ్రామంలోని ప్రభుత్వ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వేడుకలు జరుపుకున్నారు. ఏపీఓ డేవిడ్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రిన్సిపాల్ స్వప్నకుమారి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే ఏకైక గిరిజన ఇంగ్లిష్ మీడియం డిగ్రీ కళాశాల ఇదేనని తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వాపురం: మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామ పంచాయతీలోని రాంనగర్ సమీపంలో గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం అధికారులు పట్టుకున్నారు. మండలంలో అమ్మగారిపల్లి, అమెర్ద, చింతిర్యాలలో గోదావరి రేవుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న తీరుపై గత నెల 13న ‘సాక్షి’లో కథనం ప్రచురితం కాగా స్పందించిన తహసీల్దార్ ఎం.ఏ రాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు కందకాలు తవ్వారు. కానీ ఇసుక అక్రమార్కులు కందకాలు పూడ్చివేసి తిరిగి ఇసుక తరలించుకుపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు.

నేటి నుంచి అంకమ్మతల్లి తిరునాళ్లు



తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీఅంకమ్మ తల్లి ఆలయంలో శనివారం నుంచి తిరునాళ్ల మహోత్సవం ప్రారంభంకానుంది. ఈ ఉత్సవాలు ఏప్రిల్ 6వ తేదీ వరకు సాగుతాయి. 1న అమ్మవారికి బండారి పళ్లెం, 2న మైలపట్నం, కొలబియ్యం, పుట్టబంగారం, 3న పూలకప్పెర, జలబిందెలు, 4న రడకప్పెర, గ్రామసేవ, 5న ప్రభబండ్లపై గుడిబండి ఆలయ ప్రవేశం, 6న అగ్నిగుండ ప్రవేశం, బద్దెగొర్రె, అమ్మవారికి బోనాల సమర్పణ, అనంతరం ఆలయ ప్రాంగణంలో గోపయ్య, తిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అమ్మ వారి కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నదానం ఉంటుందని వారు వివరించారు.

కోలాట పోటీలు..

అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు కోలాట పోటీలు నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు 78934 57858, 94944 99755 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జగ్గారం పాఠశాలకు చేయూత



తరగతి గదులను ప్రారంభిస్తున్న జీఎం థాలే

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం రక్షణ పరిధిలోని జగ్గారం ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు భారజల కర్మాగారం యాజమాన్యం చేయూత అందిస్తోంది. పాఠశాలలో భారజల కర్మాగారం ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, వంట గదులను శుక్రవారం జీఎం కేవీ థాలే ప్రారంభించారు. మూడేళ్లుగా భారజల కర్మాగారం ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంక్, సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఈ సందర్భంగా జీఎం కేవీ థాలే మాట్లాడుతూ త్వరలో పాఠశాలకు కావాల్సిన డిజిటల్ క్లీన్ గదిని నిర్మిస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం పీజేవీ సుధాకర్, సివిల్ ఈటీసీ సాయి కుమార్‌శెట్టి, ఇంజనీరింగ్ అధికారులు, హెచ్‌ఎం భాస్కరసూరి, ఉపాధ్యాయులు, టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



బూర్గంపాడు: బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత



అశ్వారావుపేటరూరల్: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బూర్గంపాడు: ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు రాయాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత విద్యార్థులకు సూచించారు. బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు మంచి గ్రేడులు సాధించాలని కోరారు. ఉత్తమ ఫలితాలతో ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ప్రధానోపాధ్యాయుడు జాన్సన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు జక్కం సుబ్రహ్మణ్యం, ఎస్కే సాధిక్‌పాషా, కేసుపాక రమేశ్, బొందయ్య పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్ట్, నారాయణపురం, అచ్యుతాపురం గ్రామాల్లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుకు శుక్రవారం పరీక్ష ప్యాడ్లు వితరణగా అందించారు. స్థానిక అవేర్ ఐటీఐ కళాశాల ద్వారా, చైర్మన్ మాధవన్‌జీ సహకారంతో ఆయా పాఠశాలల్లోని సుమారు 200 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లతోపాటు పెన్నులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు ఫణికుమార్‌రెడ్డి, కాంతయ్య, హరిబాబు, పుల్లయ్య, అవేర్ ఐటీఐ ఏఓ ఎస్.రాఘవరావు, ఎన్.మురళీకృష్ణ, డి.ప్రసాద్, ఉపాధ్యాయులు నర్మద, రామకృష్ణ, శోభన్‌బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న రోశిరెడ్డి

బూర్గంపాడు: శ్రీరామ పట్టాభిషేకానికి భద్రాచలం వచ్చిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో పలువురు ఘన స్వాగతం పలికారు. జిల్లా ఉన్నతాధికారులతో పాటుగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. భద్రాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు యడమకంటి రోశిరెడ్డి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఐటీసీ ఉన్నతాధికారులు ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మణుగూరురూరల్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు డి.సుధాకర్, జె.మోహన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి కోచింగ్ తీసుకుని పరీక్ష రాసిన నిరుద్యోగ యువతకు టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వ్యవహారం.. తీవ్రంగా దెబ్బతీసిందని, వారి వారి ఆశలు అడియాసలుగా మారాయని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నాగుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సర్పంచ్ మొగిలి అంజలి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ శోభారాణి 119 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కె.రామకృష్ణ, లక్ష్మి, వేణుగోపాల్ పాల్గొన్నారు.